ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



నవంబర్ 10 మంగళవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 31 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

TUESDAY NOVEMBER 18 2026 | VOL:1 | ISSUE: 31 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

కేటీఆర్ గడ్డం పెంచుకుని, విచిత్ర వేషధారణతో గ్రామాల్లో తిరుగుతున్నారు: సీఎం రేవంత్ రెడ్డి

సొంత చెల్లెలు కవితను ఇంటి నుంచి బయటకు పంపిన క్రూరుడు కేటీఆర్ అని రేవంత్ విమర్శ

మహిళా సాధికారతపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్న ముఖ్యమంత్రి

కొడంగల్ నియోజకవర్గంలో మహిళా సంఘాలతో ఆత్మీయ సమ్మేళనం

రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.5 లక్షల మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ల పంపిణీ ప్రారంభం

2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని వెల్లడి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ ఒక క్రూరమైన వ్యక్తి అని, సొంత చెల్లెలు కవితను సైతం ఇంట్లో నుంచి బయటకు గెంటేశారని సీఎం ఆరోపించారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు ఏమాత్రం లేదని ఆయన విమర్శించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలతో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి

(మిగతా 2వ పేజీలో..)

పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు: కేటీఆర్

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా పరిగి వద్ద అడ్డుకున్న వైనం

రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ముందస్తుగా అరెస్టు చేసినట్లు వెల్లడి

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పార్టీ కార్యకర్త

(మిగతా 2వ పేజీలో..)



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిస్తేనే అభివృద్ధి సాధ్యం: బండి సంజయ్

కరీంనగర్‌లో రూ.4 కోట్ల అర్బన్ డెవలప్‌మెంట్ పనులకు శంకుస్థాపన

కేంద్రమంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ సంయుక్తంగా ప్రారంభం

కరీంనగర్ డంప్ యార్డు సమస్యను పరిష్కరిస్తామని మంత్రుల హామీ



కరీంనగర్ జిల్లాలో రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పట్టణాభివృద్ధి (అర్బన్ డెవలప్‌మెంట్) పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు శంకుస్థాపన చేశారు.ఈ

(మిగతా 2వ పేజీలో..

హైదరాబాద్‌పై కాలుష్య పంజా.. ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!

హైదరాబాద్‌ను వణికిస్తున్న వాయు కాలుష్యం

ప్రమాదకరంగా 410కి చేరిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్

ఐటీ కారిడార్‌లోని పలు ప్రాంతాల్లో అత్యధిక కాలుష్యం

సాధారణం కంటే నాలుగు రెట్లు పెరిగిన పీఎం 2.5 స్థాయిలు

వాహనాలు, నిర్మాణాలే ప్రధాన సమస్యగా గుర్తింపు

ఒకప్పుడు ప్రశాంత వాతావరణానికి చిరునామాగా

(మిగతా 2వ పేజీలో..)



అనంతపురంలో ఓడిపోయే అవకాశమే లేదు.. కానీ ఓటమి ఎదురైంది: సీఎం చంద్రబాబు

కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు స్థానిక ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్న చంద్రబాబు

కుప్పంలో ఒక ఎంపీటీసీ స్థానంలో ఓటమి ఎదురైనా తీర్పును గౌరవించామని స్పష్టీకరణ

అనంతపురం, గిరిజన ప్రాంతాల్లో ఎదురైన ఫలితాలపై సమీక్ష చేస్తామని ప్రకటన

స్థానిక సంస్థల ఎన్నికల్లో అనంతపురంలో ఓడిపోయే అవకాశమే లేదని, అయినప్పటికీ అక్కడ కూటమికి ఓటమి ఎదురుకావడంపై సమగ్రంగా సమీక్షించుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమికి ప్రజలు తిరుగులేని విజయాన్ని అందించినప్పటికీ, ఒకటిరెండు ప్రాంతాల్లో వచ్చిన ప్రతికూల ఫలితాలను తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై ఆయన సమగ్రంగా మాట్లాడారు. అనంతపురం ఓటమిపై లోతైన విశ్లేషణ జరుపుతామని, అక్కడ ఎందుకు ఓడిపోయామో వాస్తవాల ఆధారంగా పరిశీలించి అవసరమైతే కఠిన నిర్ణయాలు తీసుకుంటామని తేల్చిచెప్పారు.ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో తాము ఎప్పుడూ ముందుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కుప్పంలో ఒక ఎంపీటీసీ స్థానంలో కూటమి ఓడిపోయినప్పటికీ, తాము కక్కుర్తి పడలేదని అన్నారు. ఆ ప్రజా తీర్పును శిరసావహించామే తప్ప అనైతిక పద్ధతుల్లో ఆ స్థానాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నించలేదని తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసినప్పుడే అసలైన ప్రజాభిప్రాయం వెల్లడవుతుందనేది తమ సిద్ధాంతమని చెప్పారు.

(మిగతా 2వ పేజీలో..)



జిల్లాల్లోనే పూర్తి వైద్య సేవలు అందించడమే లక్ష్యం: మంత్రి దామోదర రాజనర్సింహ

తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష

ప్రతి జిల్లాలో డీసీహెచ్ఎస్ కార్యాలయాల ఏర్పాటుపై విస్తృత కసరత్తు

కమ్యూనిటీ, ఏరియా, జిల్లా ఆసుపత్రుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

తెలంగాణలో సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది. ప్రజలు చిన్న సమస్యలకు కూడా రాజధాని హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా, జిల్లాల్లోనే కార్పొరేట్ స్థాయి పూర్తి వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి

(మిగతా 2వ పేజీలో..)



పార్లమెంట్ ప్రోరోగ్‌లో రికార్డు జాప్యం.. ప్రత్యేక భేటీ కోసమేనా?

88 రోజులుగా ముగియని పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

2008 నాటి రికార్డును అధిగమించిన కేంద్ర ప్రభుత్వం

స్వల్ప నోటీసుతో సభను మళ్లీ సమావేశపరిచే అవకాశం

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే ఈ వ్యూహమని ఊహాగానాలు

లోక్‌సభ సీట్ల పెంపునకు సంబంధించిన రాజ్యాంగ సవరణపై చర్చ

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసి 88 రోజులు గడిచినా, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ సభలను ప్రోరోగ్ చేయకుండా కొనసాగించడం జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది పార్లమెంట్ చరిత్రలోనే ఓ కొత్త రికార్డు.

(మిగతా 2వ పేజీలో..)



బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.. ఏపీ, తెలంగాణలో వర్షాలు!

ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం

తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన

తెలంగాణలో క్రమంగా పెరుగుతున్న చలి తీవ్రత, పడిపోతున్న ఉష్ణోగ్రతలు

కోస్తాంధ్ర, రాయలసీమలో ఉరుములతో కూడిన వర్షాలు!

గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. నవంబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఇది ఏర్పడవచ్చని

(మిగతా 2వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సం పా దకీయం

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి.. స్థానిక పాలనలో పారదర్శకత అవసరం!

ఒక గ్రామం లేదా పట్టణం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ నిధులు, అధికార యంత్రాంగం మాత్రమే సరిపోవు. ప్రజల భాగస్వామ్యం, స్థానిక నాయకత్వం, పారదర్శకమైన పాలన కూడా అవసరం. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ, విద్య, వైద్యం వంటి సమస్యలు ప్రజల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తుంటాయి. వీటికి శాశ్వత పరిష్కారాలు చూపాలంటే స్థానిక అవసరాలను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలి. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా చేపట్టే అభివృద్ధి పనులు ఆశించిన ఫలితాలను ఇవ్వలేవు.

గ్రామసభలు, వార్డు సమావేశాలు బలోపేతం కావాలి

స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు, వార్డు సమావేశాలు కీలక వేదికలు. ప్రజలు తమ ప్రాంతంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వీటిని సమర్థంగా వినియోగించుకోవాలి. గ్రామంలో ఏ పనికి ప్రాధాన్యం ఇవ్వాలి? తాగునీటి సమస్య ఎక్కడ ఉంది? ఏ రహదారిని ముందుగా అభివృద్ధి చేయాలి? పారిశుద్ధ్య సమస్యలను ఎలా పరిష్కరించాలి? వంటి అంశాలపై ప్రజల అభిప్రాయాలు సేకరించాలి.సమావేశాలు కేవలం తీర్మానాలకే పరిమితం కాకుండా వాటి అమలుపై కూడా సమీక్ష జరగాలి. ప్రజలు అడిగే ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు స్థితి అందరికీ తెలిసేలా పారదర్శకత ఉండాలి.

అభివృద్ధి పనుల్లో నాణ్యతే ముఖ్యం

స్థానిక సంస్థల ద్వారా చేపట్టే రహదారులు, కాలువలు, తాగునీటి పైపులైన్లు, భవనాల నిర్మాణాల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. నిధులు ఖర్చు చేయడం ఒక్కటే అభివృద్ధికి కొలమానం కాదు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే పనులు చేపట్టినప్పుడే ప్రభుత్వ వ్యయానికి సార్థకత ఉంటుంది.కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తయిన కొద్దికాలానికే రహదారులు దెబ్బతినడం, కాలువలు పూడిపోవడం, నీటి పైపుల్లో లీకేజీలు ఏర్పడటం వంటి సమస్యలు కనిపిస్తుంటాయి. పనుల ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేలా వ్యవస్థ ఉండాలి.

బడ్జెట్ ఖర్చులపై ప్రజలకు సమాచారం ఇవ్వాలి

స్థానిక అభివృద్ధి కోసం కేటాయించే నిధులు ఎక్కడ ఖర్చవుతున్నాయి? ఏ పనికి ఎంత మొత్తం వెచ్చించారు? పనులు ఎప్పుడు పూర్తవుతాయి? అనే వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. బడ్జెట్ కేటాయింపులు, పనుల పురోగతి, ఖర్చుల వివరాలను బహిరంగంగా ప్రకటించడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రజాధనం ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి. అవసరం లేని పనులకు ప్రాధాన్యం ఇచ్చి, అత్యవసర సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. స్థానిక అవసరాలను బట్టి నిధుల వినియోగానికి ప్రణాళిక రూపొందించాలి. ఆర్థిక క్రమశిక్షణతో పాటు పనుల ఫలితాలను కూడా సమీక్షించాలి.

మహిళలు, యువతకు నిర్ణయాల్లో భాగస్వామ్యం

స్థానిక పాలనలో మహిళలు, యువత, వృద్ధులు, దివ్యాంగులు, వెనుకబడిన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలి. మహిళలకు తాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, పిల్లల విద్య వంటి అంశాలపై విలువైన అనుభవం ఉంటుంది. యువతకు సాంకేతిక పరిజ్ఞానం, కొత్త ఆలోచనలు ఉంటాయి. వీరి అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తే అభివృద్ధి ప్రణాళికలు మరింత సమగ్రంగా రూపొందుతాయి.ప్రజా సమావేశాల్లో అన్ని వర్గాల వారు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించే వాతావరణం కల్పించాలి. నిర్ణయాలు కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను ప్రతిబింబించాలి.

ఫిర్యాదులకు గడువులోగా పరిష్కారం

ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక సంస్థల్లో సమర్థమైన ఫిర్యాదు వ్యవస్థ ఉండాలి. రహదారులపై గుంతలు, తాగునీటి సరఫరాలో అంతరాయాలు, వీధి దీపాల సమస్యలు, చెత్త సేకరణలో జాప్యం వంటి అంశాలపై ప్రజలు సులభంగా ఫిర్యాదు చేయగలగాలి.ఫిర్యాదు స్వీకరించిన తర్వాత దాని పరిష్కారానికి బాధ్యత వహించే అధికారి ఎవరు? ఎప్పటిలోగా పరిష్కరిస్తారు? అనే వివరాలు తెలియజేయాలి. సమస్య పరిష్కారమైన తర్వాత కూడా ఫిర్యాదుదారుడికి సమాచారం అందించాలి. కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా సాంకేతిక సదుపాయాలను ఉపయోగించుకోవాలి.

కేటీఆర్ గడ్డం పెంచుకుని, విచిత్ర వేషధారణతో గ్రామాల్లో తిరుగుతున్నారు: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.కేటీఆర్ తీరుపై విమర్శలు గుప్పిస్తూ.. గడ్డం పెంచుకుని, వింత వేషధారణలతో కేటీఆర్ గ్రామాల్లో తిరుగుతున్నారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన చేసిన పనుల గురించి స్వయంగా ఆయన సోదరే వెల్లడించారని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మహిళల కోసం ఏం చేశారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.పేదరికాన్ని అధిగమించాలంటే మహిళలు తమ పిల్లలను, ముఖ్యంగా ఆడబిడ్డలను ఉన్నత చదువులు చదివించాలని పిలుపునిచ్చారు. 2034 నాటికి స్వయం సహాయక సంఘాల్లో ఒక కోటి మంది మహిళలను సభ్యులుగా చేర్చి, వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. తన పదవీ కాలంలో కోటి మంది మహిళలు లక్షాధికారులు, కోటీశ్వరులుగా మారితే తన జీవితానికి నిజమైన సార్థకత చేకూరుతుందని రేవంత్ రెడ్డి భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ వేదికపై నుంచే ముఖ్యమంత్రి 'చేయూత' పథకం కింద కొత్తగా 4.5 లక్షల మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఈ కొత్త పింఛన్లలో 3.5 లక్షల మంది ఒంటరి మహిళలు, వితంతువులు ఉన్నారని ఆయన వివరించారు. గత 34 నెలల్లో మహిళల కోసం రూ. 79,000 కోట్ల బ్యాంకు రుణాలను అనుసంధానించామని ముఖ్యమంత్రి వివరించారు. నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిటే రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని రోజూ 37 లక్షల మంది వినియోగించుకుంటున్నారని, ఆర్టీసీకి ప్రభుత్వమే నేరుగా నిధులు సమకూరుస్తూ ఆ సంస్థను లాభాల బాట పట్టిస్తోందని వివరించారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.. ఏపీ, తెలంగాణలో వర్షాలు!

మొదటి పేజీ తరువాయి)

అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, యానాం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.మరోవైపు, తెలంగాణలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఈశాన్య దిశ నుంచి వీస్తున్న పొడి గాలుల కారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 నుంచి 19 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతున్నాయి. రాజేంద్రనగర్, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్ వంటి శివారు ప్రాంతాల్లో ఉదయం వేళ దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. సాయంత్రం 5:30 తర్వాత చలి గాలుల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఇక ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14-16 డిగ్రీలకు పడిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో సాధారణం కన్నా 2-3 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి.కొత్తగా ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో రానున్న రోజుల్లో వర్ష సూచనలు ఉన్నాయి. సోమవారం కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు కూడా వీయొచ్చు. తెలంగాణలోనూ అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడొచ్చని, సోమవారం తర్వాత వాతావరణం పొడిగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అల్పపీడనం ఏర్పడిన తర్వాత దాని కదలిక, తీవ్రతను బట్టి వర్షాల ప్రభావంపై స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రజలు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, చలి నుంచి, ఆకస్మిక వర్షాల నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

హైదరాబాద్‌పై కాలుష్య పంజా.. ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!

మొదటి పేజీ తరువాయి)

ఉన్న హైదరాబాద్ నగరం ఇప్పుడు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీని తలపించేలా గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరం మొత్తం మీద ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ూూ×) 410గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ స్థాయి కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం.. గాలిలోని అతి సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 2.5 స్థాయిలు సురక్షిత పరిమితి అయిన 60 మైక్రోగ్రాములకు బదులుగా 278 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. అదేవిధంగా పీఎం 10 పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం 326 మైక్రోగ్రాములుగా ఉంది. ఇది సాధారణం కంటే దాదాపు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. ఈ స్థాయిలో కాలుష్యం కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఉన్నప్పటికీ, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డిఫెన్స్ కాలనీలో ూూ× ఏకంగా 685గా రికార్డయింది. శేరిలింగంపల్లిలో 666, మణికొండలో 602, యాంబియన్స్ ఫోర్ట్‌లో 596, ఎన్‌బీటీ నగర్‌లో 582గా కాలుష్య సూచీ నమోదైంది. ఈ ప్రాంతాలు కాలుష్య హాట్‌స్పాట్‌లుగా మారుతుండటం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది.హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఇంతలా క్షీణించడానికి ప్రధాన కారణాలు పెరిగిన వాహనాల రద్దీ, అదుపులేని నిర్మాణ కార్యక లాపాలు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ముధూళి, పారిశ్రామిక ఉద్గారాలేనని అధికారులు భావిస్తున్నా రు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో నిరంతరాయంగా సాగే నిర్మాణాలు, వాహనాల రాకపోకలు కాలు ష్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పౌరులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. రోడ్లను నీటితో శుభ్రపరచడం, నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవడం, వాహన కాలుష్య తనిఖీలను కఠినతరం చేయడం వంటివి వెంటనే ప్రారంభించాలని సూచిస్తున్నారు. లేకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ లాగా గ్యాస్ ఛాంబర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళుతున్న నాయకుడిని పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు.వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలోని బహార్‌పేట్ చౌరస్తా వద్ద పోలీసులు పట్నం నరేందర్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన కోస్గిలో మరణించిన ఓ బీఆర్ఎస్ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉన్నందున, ముందస్తు జాగ్రత్త చర్యగానే నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ అరెస్టుతో ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసు వాహనాన్ని చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "పరామర్శించేందుకు వెళుతున్న నాయకుడిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏముంది? బాధిత కుటుంబానికి అండగా నిలవడం కూడా ఇందిరమ్మ రాజ్యంలో నేరమైందా? నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాంగ్రెస్ పార్టీ పాలనగా మార్చుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదు. ప్రజల, కార్యకర్తల పక్షాన పోరాటం కొనసాగుతుంది. పట్నం నరేందర్‌రెడ్డిని ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు. మరోవైపు, పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా ఖండించారు. ప్రతిపక్ష నేతలను అకారణంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పార్టీ నేతలు స్పష్టం చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిస్తేనే అభివృద్ధి సాధ్యం: బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కలిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. నగరంలో ప్రధాన సమస్యగా మారిన డంప్ యార్డ్ అంశాన్ని త్వరలోనే పరిష్కరిస్తామని, దీనిపై ఎవరూ అనవసర వివాదాలు చేయవద్దని సూచించారు. అభివృద్ధి పనులకు కొందరు కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. కాంట్రాక్టర్లను భయపెడితే పనులు కావని, కరీంనగర్ పేరును సర్వనాశనం చేయాలని చూసే నీచ రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని హితవు పలికారు. చిల్లర వేషాలు వేస్తే ప్రజలు ఊరుకోరని, పనులను అడ్డుకుంటే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కరీంనగర్ డంప్ యార్డ్ సమస్య ఇప్పటిది కాదని, దీని పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం సైతం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. తమకు ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత ప్రజా సంక్షేమమే ముఖ్యమని పేర్కొన్నారు. దీంతో పాటు సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ప్రోరోగ్‌లో రికార్డు జాప్యం.. ప్రత్యేక భేటీ కోసమేనా?

మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 13, 2026న లోక్‌సభ, రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడినప్పటికీ, సోమవారం నాటికి కూడా రాష్ట్రపతి వాటిని అధికారికంగా ముగించలేదు (ప్రోరోగ్ చేయలేదు).సాధారణంగా సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాక, రాష్ట్రపతి సభలను ప్రోరోగ్ చేస్తారు. కానీ అలా చేయకపోవడం వల్ల, కేవలం రెండు రోజుల స్వల్ప నోటీసుతో ప్రభుత్వం ఎప్పుడైనా సభలను తిరిగి సమావేశపరచవచ్చు. అదే కొత్త సెషన్ ప్రారంభించాలంటే కనీసం 14 రోజుల నోటీసు అవసరం. ఈ సౌలభ్యం కోసమే కేంద్రం ఉద్దేశపూర్వకంగా సమావేశాలను అధికారికంగా ముగించలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో, మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించిన రాజ్యాంగ సవరణను ఆమోదింపజేసుకోవడానికే కేంద్రం ఈ వ్యూహాన్ని అనుసరిస్తోందన్న ఊహాగానాలు బలపడుతున్నాయి. లోక్‌సభ స్థానాలను ప్రస్తుత 543 నుంచి గరిష్ఠంగా 850కి పెంచే డీలిమిటేషన్ ప్రక్రియతో ఈ బిల్లు ముడిపడి ఉంది. ఇదే తరహా రాజ్యాంగ సవరణ బిల్లు ఏప్రిల్ 17న జరిగిన బడ్జెట్ సెషన్ ప్రత్యేక సమావేశంలో లోక్‌సభలో తగినంత మెజారిటీ లభించక విఫలమైన విషయం తెలిసిందే. గతంలో 2008లో 87 రోజుల పాటు సభలను ప్రోరోగ్ చేయకుండా కొనసాగించడమే ఇప్పటివరకు రికార్డుగా ఉండేది. ఇప్పుడు ఆ రికార్డు బద్దలైంది. సభలను ప్రోరోగ్ చేయడానికి రాజ్యాంగంలో నిర్దిష్ట కాలపరిమితి ఏదీ లేదు, కాబట్టి ఇది నిబంధనల ఉల్లంఘన కాదు. అయితే, సభలను తిరిగి సమావేశపరిచే విషయంపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

జిల్లాల్లోనే పూర్తి వైద్య సేవలు అందించడమే లక్ష్యం: మంత్రి దామోదర రాజనర్సింహ

మొదటి పేజీ తరువాయి)

దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు.హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రుల్లో సేవల నాణ్యత, పనితీరును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) కార్యాలయాలను ఏర్పాటు చేసే ప్రతిపాదనపై అధికారులతో చర్చించారు. రాష్ట్ర స్థాయి డైరెక్టరేట్ నుంచి జిల్లా స్థాయి వరకు స్పష్టమైన పాలనా బాధ్యతలు ఉండాలని మంత్రి పేర్కొన్నారు.కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్సీ), ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని దామోదర రాజనర్సింహ ఆదేశించారు. రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మౌలిక వసతుల లోపాలు, సిబ్బంది కొరత వంటి సమస్యలను జిల్లా స్థాయిలోనే ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సూచించారు. వైద్య సేవల విస్తరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యుల నియామకాలతో పాటు అవసరమైన నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల నియామక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన చికిత్సను చేరువ చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన తెలిపారు.

అనంతపురంలో ఓడిపోయే అవకాశమే లేదు.. కానీ ఓటమి ఎదురైంది: సీఎం చంద్రబాబు

ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సాకులతో న్యాయస్థానాలను ఆశ్రయించిందని, అయితే వారి కుట్రలను సుప్రీంకోర్టు సైతం తిప్పికొట్టిందని గుర్తుచేశారు. హింస, విధ్వంసకర రాజకీయాలకు ప్రజాతీర్పుతో కాలం చెల్లిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులపై బాధ్యత మరింత పెరిగిందని, రాష్ట్రాన్ని గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టేందుకు అందరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని చంద్రబాబు పేర్కొన్నారు. అయినప్పటికీ అక్కడ ఫలితాలు ఎందుకు అనుకూలంగా రాలేదో పరిశీలిస్తామని, ఓటర్లపై ఏమైనా ప్రలోభాల ప్రభావం పడిందా అనే కోణంలోనూ ఆరా తీస్తామని వివరించారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగి ఉంటే సరిదిద్దుకోవడానికి తమకు ఎలాంటి భేషజాలు లేవన్నారు. 2024 సాధారణ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు కూటమికి ప్రజల్లో ఆదరణ మరింత పెరిగిందని, వైసీపీని ప్రజలు గతానికంటే ఎక్కువగా తిరస్కరించారని చెప్పారు. పెళ్లి సంబంధం కుదుర్చుకునే సమయంలో ఇరువైపులా ఏడు తరాలు ఎలా చూస్తారో, ప్రజలు కూడా అలాగే అభ్యర్థుల గుణగణాలు, నేపథ్యాన్ని లోతుగా పరిశీలించి విజ్ఞతతో ఓటు వేశారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజల చిరకాల ఆకాంక్ష మేరకు మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయడంతో పాటు పేదలకు ఇళ్ల పట్టాలు అందించామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా తాగు, సాగునీరు అందించామని, పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖ, అనకాపల్లి ప్రాంతాలకు గోదావరి జలాలు తరలించామని వివరించారు. ఈ అభివృద్ధిని గుర్తించిన ప్రజలు మార్కాపురంలో 21కి 21, అనకాపల్లిలో 24కి 24 జెడ్పీటీసీ స్థానాల్లో కూటమిని గెలిపించారని, విశాఖ మేయర్ పీఠాన్ని దాదాపు 2.50 లక్షల భారీ ఓట్ల మెజారిటీతో కట్టబెట్టారని వివరించారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

నల్లగొండలో కారుణ్య నియామకాల కుంభకోణం!

- **పదవీ విరమణ చేసిన ఉద్యోగిని విధుల్లో ఉండగానే మృతి చెందినట్లు రికార్డులు.. కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం**
- **రూ.13 లక్షల ఒప్పందం జరిగినట్లు పోలీసుల వెల్లడి। నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం, తప్పుడు విచారణ నివేదికల వ్యవహారం। 14 మంది అరెస్ట్.. మరో ఇద్దరు పరారీ**

నల్లగొండ, నవంబర్ 9 (ప్రజానేస్తం -- జ్వాల):

ప్రభుత్వ ఉద్యోగం కోసం నిబంధనలకు విరుద్ధంగా రికార్డులు సృష్టించి, పదవీ విరమణ చేసిన ఉద్యోగిని విధుల్లో ఉండగానే మరణించినట్లు చూపించి ఆయన కుమారుడికి కారుణ్య నియామకం కల్పించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భారీ అక్రమ వ్యవహారం నల్లగొండ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. ఆధార్ కార్డులో చిరునామా మార్పు, మున్సిపాలిటీ నుంచి నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం పొందడం, వైద్య ఆరోగ్య శాఖలో తప్పుడు విచారణ నివేదికలు రూపొందించడం వంటి పరిణామాలతో ఈ వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసులో కుటుంబ సభ్యులు, బంధువులు, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది సహా మొత్తం 14 మందిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

పదవీ విరమణ తర్వాత మరణం.. రికార్డుల్లో ముందుగానే మృతి!

నకిరేకల్ మండలం ఒగోడు గ్రామానికి చెందిన చామకూరి వెంకటేశ్వర్లు శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేసి 2025 మే 31న పదవీ విరమణ పొందారు. కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అదే ఏడాది నవంబర్ 17న మరణించారు. అయితే, ఆయన ఉద్యోగంలో ఉండగానే 2025 మే 28న మరణించినట్లు రికార్డులు సృష్టించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

రూ.13 లక్షలకు ఒప్పందం?

వెంకటేశ్వర్లు మరణాన్ని ముందుగానే జరిగినట్లు చూపించి ఆయన కుమారుడు చామకూరి రాజుకు కారుణ్య నియామకం పొందేలా కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో మృతుడి భార్య వసంత, కుమారుడు రాజు, బంధువులు రాజశేఖర్, రవీందర్ తదితరులు కీలకంగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. నల్లగొండ డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న పోలె రంజిత్ కుమార్‌ను సంప్రదించి, రూ.13 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసుల ప్రకటనలో వెల్లడైంది.

ఆధార్ చిరునామా మార్పుతో నకిలీ ధ్రువీకరణ!

వెంకటేశ్వర్లు ఆధార్ కార్డులో నల్లగొండ పట్టణంలోని చైతన్యపురి కాలనీ చిరునామాను నమోదు చేయించినట్లు దర్యాప్తులో గుర్తించారు. మీ సేవా కేంద్రం ద్వారా ఈ మార్పు జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఆ చిరునామా ఆధారంగా నల్లగొండ మున్సిపాలిటీ నుంచి 2025 మే 28న మరణించినట్లు చూపిస్తూ ధ్రువీకరణ పత్రం పొందినట్లు పేర్కొన్నారు.

మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖల పాత్రపై విచారణ

మరణ ధ్రువీకరణ పత్రం జారీ ప్రక్రియలో వార్డు ఆఫీసర్ ముక్కముయిల శివ జనార్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్. ప్రదీప్ రెడ్డి పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు శాలిగౌరారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆకుల కృష్ణ సూర్య శిల్ప సంబంధిత దరఖాస్తును డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న పోలె రంజిత్ కుమార్, గింకల రాకేష్ యాదవ్, తుంగతుర్తి మోహన్ కృష్ణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మహబూబ్ అలీ, ఆఫీస్ సూపరింటెండెంట్ నాగిరెడ్డి జితేందర్ రెడ్డి తదితరులు తప్పుడు విచారణ నివేదికలు రూపొందించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ నివేదికల ఆధారంగానే కుమారుడికి దామరచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కారుణ్య నియామకం కల్పించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కమిషనర్ ఫిర్యాదుతో వెలుగులోకి..

నల్లగొండ మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు నవంబర్ 4న నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 299/2026 కింద కేసు నమోదైంది. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ కె. శివరామిరెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. ఈ క్రమంలో 14 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న వస్తువులు

రూ.5 లక్షల నగదు, ఒక కంప్యూటర్, ఒక ప్రింటర్, 12 సెల్‌ఫోన్లు, మృతుడు వెంకటేశ్వర్లు ఫొటోను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

అరెస్టయిన 14 మంది

1. చామకూరి వసంత
2. చామకూరి రాజు
3. కంచర్ల జగన్నాధ రెడ్డి
4. రాచకొండ వెంకటేశ్వర్లు అలియాస్ వెంకట్ గౌడ్
5. డాక్టర్ ఆకుల కృష్ణ సూర్య శిల్ప
6. పనస చంద్రశేఖర్ అలియాస్ చందు
7. కట్ల సతీష్
8. ముక్కముయిల శివ జనార్ధన్
9. ఎన్. ప్రదీప్ రెడ్డి
10. పోలె రంజిత్ కుమార్
11. నాగిరెడ్డి జితేందర్ రెడ్డి
12. మహబూబ్ అలీ
13. గింకల రాకేష్ యాదవ్
14. తుంగతుర్తి మోహన్ కృష్ణ

మరో ఇద్దరు పరారీలో..

చామకూరి రాజశేఖర్, చామకూరి రవీందర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

ఇంకా తేలాల్సిన ప్రశ్నలెన్నో!

పదవీ విరమణ చేసిన ఉద్యోగి మరణించిన తేదీని మార్చి రికార్డులు ఎలా సృష్టించారు? ఆధార్ చిరునామా మార్పునకు ఎవరు సహకరించారు? మున్సిపాలిటీలో మరణ ధ్రువీకరణ పత్రం జారీ సమయంలో తనిఖీలు ఎందుకు జరగలేదు? వైద్య ఆరోగ్య శాఖలో తప్పుడు విచారణ నివేదికలు ఎలా ఆమోదం పొందాయి? రూ.13 లక్షల ఒప్పందంలో నగదు ఎవరెవరికి చేరింది? ఈ వ్యవహారంలో ఇంకా ఎవరైనా ఉన్నారా? ఈ ప్రశ్నలకు పోలీసుల తదుపరి దర్యాప్తులో సమాధానాలు రావాల్సి ఉంది. ఒక కారుణ్య నియామకం కోసం పలు శాఖల రికార్డులు, ధ్రువీకరణ పత్రాలు, విచారణ నివేదికలు వివాదంలోకి రావడం ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ, పర్యవేక్షణ వ్యవస్థలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. కేసు దర్యాప్తులో ఉన్నందున నిందితులపై ఆరోపణలు న్యాయస్థానంలో నిరూపితం కావాల్సి ఉంది.

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- **లబ్ధిదారుల ఇంటిని ప్రారంభించి నూతన వస్త్రాల బహూకరణ.. కుటుంబంతో కలిసి సహపంక్తి భోజనం**

కొడంగల్, (ప్రజానేస్తం జ్వాల):



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకల్లో పాల్గొని లబ్ధిదారుల కుటుంబంలో ఆనందాన్ని నింపారు. కొడంగల్ మండలం పర్సాపూర్ గ్రామానికి చెందిన గోరిపల్లి సుమిత్ర, శ్రీనివాస్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా దంపతులకు ముఖ్యమంత్రి నూతన వస్త్రాలను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి ఇంట్లో వండిన సన్నబియ్యం భోజనాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆరగించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న నిరుపేద కుటుంబంతో ముఖ్యమంత్రి స్వయంగా పండుగ ఆనందాలను పంచుకోవడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహా, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ (సీతక్క), ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- **రామస్వామి గట్టు వద్ద నివాస స్థలాలు కేటాయించాలని ఆర్డీఓకు వినతి**

హుజూర్‌నగర్,నవంబర్9 (ప్రజానేస్తం జ్వాల):



న్యాయవాదుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రామస్వామి గట్టు వద్ద న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, మాజీ కౌన్సిలర్ జక్కుల వీరయ్య యాదవ్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులు ఎదుర్కొంటున్న నివాస సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. రామస్వామి గట్టు వద్ద అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను చేపట్టాలని జక్కుల వీరయ్య యాదవ్ కోరారు.

మేళ్లచెరువులో చార్జింగ్‌లో ఉన్న బ్యాటరీ బైక్ దగ్ధం

మేళ్లచెరువు , నవంబర్9, (ప్రజానేస్తం జ్వాల):



మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో బ్యాటరీ బైక్ దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. ఎస్వీ రెడీమేడ్ డ్రెస్సెస్ యజమాని సామల వెంకట్ రెడ్డి ఎప్పటిలాగే సోమవారం ఉదయం తన ఎలక్ట్రిక్ బైక్‌కు చార్జింగ్ పెట్టారు. చార్జింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే షార్ట్ సర్క్యూట్ కారణంగా బైక్‌కు మంటలు అంటుకున్నాయి. క్షణాల్లోనే మంటలు వ్యాపించి బైక్ పూర్తిగా దగ్ధమైంది. వెంటనే స్పందించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మై హోమ్ సిమెంట్ పరిశ్రమకు చెందిన ఫైర్ ఇంజన్ అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. అనంతరం పూర్తిగా చల్లార్చారు. ఈ ఘటనలో బైక్ పూర్తిగా కాలిపోగా, ఇతర ఆస్తి నష్టం సంభవించలేదు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి పోలీసుల వేగవంతమైన స్పందన

- **పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల సమస్యలు స్వయంగా విన్న ఎస్పీ నరసింహ**
- **ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలి.. అధికారులకు ఎస్పీ ఆదేశం**



సూర్యాపేట, నవంబర్ 09,(ప్రజానేస్తం జ్వాల):

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తోందని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే (ప్రజావాణి) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బాధితులు అందించిన వినతిపత్రాలను పరిశీలించి, సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడిన ఎస్పీ, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని, సమస్యల తీవ్రతను బట్టి చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులను కార్యాలయాల చుట్టూ తిప్పించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గొడవలకు దూరంగా ఉండాలి.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

ప్రజా రక్షణ కోసం పోలీసు సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. వ్యక్తిగత వివాదాలు, కుటుంబ సమస్యలు, భూ తగాదాలు తదితర అంశాల్లో ప్రజలు సంయమనం పాటించాలని సూచించారు. చిన్నపాటి సమస్యలను పెద్ద గొడవలుగా మార్చుకోవద్దని, ఆవేశంలో దాడులకు పాల్పడకుండా ఇరు వర్గాలు పెద్దల సమక్షంలో సామరస్యపూర్వకంగా సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన పోలీస్ సేవలు అందించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

జాతీయ స్థాయి పోలీస్ క్రీడలకు సూర్యాపేట మహిళా పోలీస్ క్రీడాకారుల ఎంపిక

- **రాష్ట్రస్థాయి పోటీల్లో వాలీబాల్‌లో ప్రథమం.. కబడ్డీలో ద్వితీయం**
- **ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌కు ఏడుగురు మహిళా పోలీసుల ఎంపిక**

సూర్యాపేట, నవంబర్ 09, (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ రాష్ట్ర ఐదవ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో సూర్యాపేట జిల్లా మహిళా పోలీస్ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా ఖ్యాతిని చాటారు. వరంగల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో గత వారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పోలీస్ జోన్-5 తరఫున ప్రాతినిధ్యం వహించిన సూర్యాపేట జిల్లా క్రీడాకారులు మహిళా వాలీబాల్‌లో ప్రథమ స్థానం, మహిళా కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించడంలో కీలకపాత్ర పోషించారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్‌ను క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిని అభినందించి, జాతీయస్థాయి పోటీల్లోనూ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌కు ఏడుగురు ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన జిల్లా మహిళా పోలీస్ క్రీడాకారులకు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. మహిళా కబడ్డీ విభాగంలో సీహెచ్. లత, ఎన్. దీపిక, ఎం. అనూష, ఎస్.కె. అనీఫా తెలంగాణ రాష్ట్ర పోలీస్ జట్టు తరఫున ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌కు ఎంపికయ్యారు. ఈ పోటీలు వచ్చే నెలలో ఉత్తరప్రదేశ్‌లో జరగనున్నాయి. మహిళా వాలీబాల్ విభాగంలో కే. లావణ్య, బి. ప్రియాంక జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కాగా, ఈ పోటీలు తమిళనాడులో నిర్వహించనున్నారు. మహిళా కోకో విభాగంలో కే. దివ్యభారతి తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం: ఎస్పీ

ఈ సందర్భంగా ఎస్పీ కె. నరసింహ మాట్లాడుతూ.. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. జోన్-5 జట్లలో జిల్లా మహిళా కానిస్టేబుళ్లు తమ క్రీడా నైపుణ్యం, సమన్వయం, పట్టుదలతో విజయాలు సాధించడం గర్వకారణమన్నారు. జాతీయస్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో రాణించి తెలంగాణ రాష్ట్రానికి, సూర్యాపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ చూపే పోలీస్ సిబ్బందికి శాఖాపరంగా తగిన ప్రోత్సాహకాలు, అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అడ్మిన్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ జానయ్య, కబడ్డీ జట్టు కోచ్ ఎస్ఐ రామచందర్ గౌడ్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, వాలీబాల్ జట్టు కోచ్ కానిస్టేబుల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.





ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- **పెండింగ్ అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: అదనపు కలెక్టర్ బి. హరిసింగ్**

సూర్యాపేట, నవంబర్ 09(ప్రజానేస్తం జ్వాల):



ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 56 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సూచించారు. జిల్లా, మండల స్థాయిల్లో స్వీకరించే అర్జీలను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్రస్థాయి ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై కూడా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అధికారుల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. స్థానికంగా పరిష్కరించగలిగే సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరిస్తే ప్రజలకు జిల్లా కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు.సోమవారం ప్రజావాణికి వచ్చిన 56 దరఖాస్తుల్లో భూ సమస్యలు, రెవెన్యూ శాఖకు సంబంధించి 24, డీపీఓకు 4, పీడీ హౌసింగ్‌కు 2, డీడబ్ల్యూఓకు 3, డీఈఓకు 4, డీఎంహెచ్‌వోకు 2, డీఆర్డీఓకు 2, ఇతర శాఖలకు సంబంధించి 15 దరఖాస్తులు అందాయి. వీటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, డీఎంహెచ్‌వో వెంకటరమణ, సీపీఓ కిషన్, సీఎఫ్ఓ దామోదర్ రెడ్డి, డీఎస్ఓ మోహన్ బాబు, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీపీఓ యాదగిరి, డీఐఈఓ సులోచన రాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ఘనంగా చండీ హోమం...

భీమదేవరపల్లి ప్రజా నేస్తం జ్వాల:



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేకంగా చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ 2వ వార్షికోత్సవం: అమృత వర్షిణి వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు.. కేక్ కట్ చేసి అన్నదానం!



హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):

సమాచార హక్కు చట్టం (RTI) సాధన కమిటీ రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ అధ్యక్షులు చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర ప్రవంతి గార్ల ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అమృత వర్షిణి వృద్ధాశ్రమంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి, వారికి పండ్లు, అన్నదానం అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులుగా స్టేట్ కన్వీనర్ డాక్టర్ కిఫాయత్ ఎండీ, రాష్ట్ర సెక్రటరీ లావుడియా రఘు పాల్గొన్నారు. జిల్లా కమిటీ నుంచి జిల్లా అధ్యక్షులు తోట సురేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మారెల్లి కిరణ్, జిల్లా కన్వీనర్ కాసాని దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షులు రఘుపతి, జిల్లా కార్యదర్శి రావుల రమేష్, జిల్లా జాయింట్ సెక్రెటరీ నార్ల హరిబాబు, మండల స్థాయి నుంచి భూపాలపల్లి మండల అధ్యక్షుడు మార్కపురి శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తోట సురేష్ మాట్లాడుతూ.. సమాజంలో పారదర్శకత తీసుకురావడానికి ఆర్టీఐ చట్టం ఒక శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. గతంలో సంస్థ ద్వారా చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలను సమీక్షించుకుంటూ, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యాచరణను వివరించారు. ప్రజల ప్రతి సమస్యకు పరిష్కారాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని, సంస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.



రాయినిగూడెంలో అయ్యప్ప నామస్మరణతో మార్మోగనున్న ఆధ్యాత్మిక వేడుకలు!

- **అంగరంగ వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ -- హోమగుండం మహోత్సవం**
- **గుండు వీరబాబు గౌడ్ గురుస్వామి 18వ పడినారికేళ్ల సందర్భంగా భారీ ఏర్పాట్లు.. ముఖ్య అతిథులుగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి**

రాయినిగూడెం, నవంబర్9,(ప్రజానేస్తం జ్వాల):



అయ్యప్ప స్వామి భక్తి పారవశ్యంతో రాయినిగూడెం గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. మణికంఠుని దివ్య ఆశీస్సులతో గుండు వీరబాబు గౌడ్ గురుస్వామి 18వ పడినారికేళ్ల సందర్భంగా శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ, హోమగుండం మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 13వ తేదీ శుక్రవారం రాత్రి 7.30 గంటలకు జరిగే ఈ మహోత్సవానికి సకల దీక్షా స్వాములు, గురుస్వాములు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మహోత్సవంలో భాగంగా తెల్లవారుజామున 4 గంటలకు కలశ పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఉదయం 8 గంటలకు నగర సంకీర్తన, 10 గంటలకు పంబా ఆరట్టు, 11 గంటలకు స్వామివారి అభిషేకాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు అగ్నిగుండానికి భూమిపూజ, సాయంత్రం 6 గంటలకు మహా పడిపూజ ప్రారంభం కానుంది. రాత్రి 7.40 గంటలకు దీక్షా స్వాములు అగ్నిగుండ ప్రవేశం చేయనున్నారు. అనంతరం రాత్రి 8 గంటలకు నారికేళ పూజ, 10 గంటలకు శయన హారతి, 10.45 గంటలకు స్వాములకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

ముఖ్య అతిథులుగా మంత్రి, ఎమ్మెల్యే

ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు పద్మావతి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొననున్నారు.



భక్తి కార్యక్రమాలు.. ప్రత్యేక ఆకర్షణలు

మహోత్సవానికి పల్లా శ్రీను స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కొండాపురం భజన బృందం భజన కార్యక్రమాలు, చిల్లంచర్ల భాస్కర్ స్వామి ఆధ్వర్యంలో భక్తి కార్యక్రమాలు, పోలేనిగూడెం లైటింగ్, సింగారం అన్నం కొండారెడ్డి ఆర్కెస్ట్రా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. వివిధ వేషధారణలు, భజనలు, ఆధ్యాత్మిక ప్రదర్శనలతో వేడుకలను కనులపండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తులందరికీ నిర్వాహకుల ఆహ్వానం

ఈ మహోత్సవ నిర్వహణలో సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు మరియు రాయినిగూడెం సర్పంచ్ గుండు రామాంజిగౌడ్ స్వామి, పీఠం గురుస్వామి, గుండు అంజయ్య స్వామి, 18వ పడికి గురుస్వామి గుండు వీరబాబు, గుండు వెంకన్న స్వామి, గుండు శ్రీనివాస్ స్వామి, గుండు హనుమంతు, మేకపోతుల రాంబాబు, కుక్కడపు వినయ్, గుండు సైదులు, గుండు నవీన్, శ్రీధర్, సాయి, అప్పారావు, వీరబాబు, అంజయ్య, నరేష్, రామకృష్ణ తదితర అయ్యప్ప స్వాములు భాగస్వాములవుతున్నారు.మణికంఠుని నామస్మరణతో పులకించిపోయే ఈ పవిత్ర మహోత్సవానికి సకల దీక్షా స్వాములు, గురుస్వాములు, భక్తులు, గ్రామ ప్రజలు కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నారు.

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దోపిడీకి ప్రభుత్వమే అండా?

- **తొలుత క్వింటాకు రూ.4,600.. ఇప్పుడు రూ.3,000కే కొనుగోళ్లా?**
- **బియ్యం ధరలను నియంత్రించలేని ప్రభుత్వం.. రైతుల ధాన్యం ధర తగ్గించేందుకు మాత్రం నిబంధనలా?**
- **మిల్లర్ల తీరుపై సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు ఆగ్రహం**

గరిడేపల్లి, నవంబర్9, (ప్రజానేస్తం జ్వాల):

ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని అమ్ముకునే సమయంలో రైతులను మిల్లర్లు నిలువునా దోపిడీ చేస్తున్నారని, ఈ దోపిడీకి ప్రభుత్వ విధానాలే పరోక్షంగా అండగా నిలుస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు తీవ్రంగా విమర్శించారు. తొలినాళ్లలో క్వింటా ధాన్యాన్ని రూ.4,600కు ఎగబడి కొనుగోలు చేసిన మిల్లర్లు, ప్రస్తుతం అదే ధాన్యాన్ని రూ.3,000కే కొనుగోలు చేయడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు.గరిడేపల్లి మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈ వానాకాలం సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటిపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటూ రైతులు రెయింబవళ్లు శ్రమించి వరి పంటను సాగు చేశారని తెలిపారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుందని ధాన్యం ధర పెరగడంతో సంతోషించిన రైతులకు ప్రస్తుతం మిల్లర్ల వ్యవహారశైలి తీవ్ర నిరాశ కలిగిస్తోందన్నారు.

రూ.4,600 నుంచి రూ.3,000కు ధర పతనం ఎందుకు?

ధాన్యం కోతలు ప్రారంభమైన తొలిరోజుల్లో క్వింటాకు రూ.4,600 చొప్పున కొనుగోలు చేసిన మిల్లర్లు, ప్రస్తుతం అదే ధాన్యానికి రూ.3,000 మాత్రమే చెల్లిస్తామని చెప్పడం రైతులను ఆర్థికంగా దెబ్బతీయడమేనని వెంకటేశ్వర్లు అన్నారు. ధర ఎందుకు తగ్గించారని రైతులు ప్రశ్నిస్తే ప్రభుత్వం మిల్లుల ఎదుట ఏర్పాటు చేసిన బియ్యం ధరల పట్టికలను చూపిస్తూ తప్పించుకుంటున్నారని విమర్శించారు.రైతులు ధాన్యం అమ్ముకునే సమయంలోనే బియ్యం ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించలేని ప్రభుత్వం, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో మాత్రం మిల్లుల ముందు ధరల పట్టికలు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.



బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలపై నియంత్రణ ఏది?

బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం రూ.100 వరకు విక్రయిస్తున్నా నియంత్రణ చర్యలు తీసుకోలేని ప్రభుత్వం, మిల్లుల ముందు బియ్యం ధరల పట్టికలు ఏర్పాటు చేయడంలో చూపుతున్న శ్రద్ధను వినియోగదారులకు సరసమైన ధరలకు బియ్యం అందించడంలోనూ చూపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ధరల పట్టికల ప్రకారమే రానున్న రోజుల్లోనూ బియ్యం విక్రయించేలా చర్యలు తీసుకునే ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు.ప్రతి సంవత్సరం రైతులు ధాన్యం మిల్లులకు విక్రయించిన తర్వాత బియ్యం ధరలు మాత్రం మార్కెట్లో పెరుగుతున్నాయని, అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల మధ్య కుమ్మక్కు ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

రైతులకు న్యాయం చేయకుంటే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలను అధిగమించి పంటను కాపాడుకున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని వెంకటేశ్వర్లు అన్నారు. మిల్లర్ల ధరల దోపిడీని అరికట్టి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత పాటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రైతుల కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోకపోతే భవిష్యత్తులో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు.

హనుమకొండ: సీఈఐఆర్ పోర్టల్‌తో 5 పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు రికవరీ.. బాధితులకు అందజేత!

హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):

కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ (CEIR) పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్న 5 మొబైల్ ఫోన్లను హనుమకొండ పోలీసులు బాధితులకు తిరిగి అందజేశారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత రికవరీ చేసిన ఫోన్లను యజమానులకు స్వయంగా అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నరసింహారావు, ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల హక్కుల కోసం స్వేరోస్ పోరుబాట..

- **ప్రతిజ్ఞ దివస్‌కు పోస్టర్ ఆవిష్కరణ ఆవిష్కరించిన ఎర్ర రాజు..**



భీమదేవరపల్లి ప్రజా నేస్తం జ్వాల నవంబర్ 09:-

స్వేరో స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23న హనుమకొండ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్న ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద స్వేరోస్ రాష్ట్ర నాయకులు ఎర్ర రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తూ, వారి హక్కుల సాధన కోసం స్వేరో స్టూడెంట్స్ యూనియన్ కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్వేరోస్ సీనియర్ నాయకులు శనిగారపు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, ప్రోగ్రాం కన్వీనర్ ఎల్తూరి సాయికుమార్, కో-కన్వీనర్లు శివకుమార్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకొండ వీరభద్రస్వామి జాతర 2027 టెండర్లకు ప్రకటన....

- **ఈ నెల 16న టెండర్ల బహిరంగ వేలం..**
- **వివిధ హక్కుల కేటాయింపునకు దేవస్థానం ఏర్పాట్లు...**

భీమదేవరపల్లి ప్రజా నేస్తం జ్వాల:-

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 2027 నూతన సంవత్సర జాతర సందర్భంగా వివిధ హక్కుల కేటాయింపునకు టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ నెల 16వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు దేవస్థానం ప్రాంగణంలో బహిరంగ టెండర్ల వేలం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.ఈ వేలంలో ఎండుకొబ్బరికాయలు, బియ్యం, బట్టలు, కండువాలు, వీరుల సేకరణ హక్కులకు రూ.2 లక్షలు, కొబ్బరికాయల సేకరణ హక్కుకు రూ.2 లక్షలు, పుట్నాలు, పాసారాలు అమ్మకానికి రూ.10 వేలు, పార్కింగ్ హక్కుకు రూ.50 వేలు, రంగుల సున్నాలు వేయడానికి రూ.10 వేలుగా ధరలు నిర్ణయించారు. ప్రతి టెండర్‌కు రూ.200 డీడీ చెల్లించాలని నిబంధన విధించారు.ఆసక్తి గలవారు నిర్దిష్ట నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొనాలని దేవస్థాన అధికారులు సూచించారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

హనుమకొండలో ఈ నెల 12న ప్రైవేట్ జాబ్ మేళా: 450 ఉద్యోగ ఖాళీల భర్తీ!

హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):

హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన భారీ ప్రైవేట్ జాబ్ మేళా నిర్వహించనున్నారు. ప్రముఖ ఎస్‌కేఎస్‌ఎస్ (ఖాఖూ) సంస్థలో 250 అసెంబ్లీ ఆపరేటర్లు, 200 వేర్‌హౌస్ ఆపరేటర్ల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు చేపట్టనున్నారు. ఎస్సెస్సీ, ఇంటర్, నాన్ టెక్నికల్ డిగ్రీ విద్యార్హతలు కలిగి, 19 నుంచి 32 ఏళ్ల మధ్య వయస్సున్న అభ్యర్థులు అర్హులని అధికారులు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.19,288 వేతనంతో పాటు ఇతర అలవెన్సులు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉచిత భోజన సదుపాయం కల్పిస్తారు. అర్హులైన అభ్యర్థులు 12వ తేదీ ఉదయం 10:30 గంటలకు హనుమకొండ ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లో హాజరుకావాలని కోరారు.



బల్దియా ప్రజావాణికి 34 అర్జీలు: సత్వర పరిష్కారానికి అధికారుల ఆదేశం!



హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగర పౌరుల నుంచి 34 ఫిర్యాదులు అందాయి. వీటిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 14, ఇంజనీరింగ్ విభాగానికి 11, హెల్త్ అండ్ శానిటేషన్‌కు 5, తాగునీటి సరఫరా విభాగానికి 3, రెవెన్యూ విభాగానికి ఒక దరఖాస్తు వచ్చాయి. బాధితుల నుంచి వినతులను స్వీకరించిన ఇన్‌ఛార్జ్ అదనపు కమిషనర్ సమ్మయ్య.. సమస్యలను తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రామప్ప ఆలయానికి బొగ్గు గని ముప్పు: తెలంగాణ ప్రభుత్వానికి ఎన్‌హెచ్‌ఆర్‌సీ కీలక ఆదేశాలు!

హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):



యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయం సమీపంలో సింగరేణి ఓపెన్‌కాస్ట్-4 బొగ్గు గని విస్తరణ ప్రతిపాదనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC) తీవ్రంగా స్పందించింది. గని తవ్వకాల వల్ల చారిత్రక రామప్ప ఆలయ ఉనికితో పాటు రామప్ప చెరువు, పరిసర అటవీ ప్రాంతాలు, అన్నదాతల వ్యవసాయ భూములకు తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదముందని న్యాయవాది రామారావు ఇమ్మనేని దాఖలు చేసిన పిటిషన్‌పై కమిషన్ విచారణ చేపట్టింది. ఈ ముప్పుపై పూర్తిస్థాయిలో పరిశీలించి 4 వారాల్లోగా సమగ్ర కార్యాచరణ నివేదికను సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది.

హనుమకొండ కలెక్టరేట్ ప్రజావాణికి 84 అర్జీలు: సత్వర పరిష్కారానికి అదనపు కలెక్టర్ ఆదేశం!

హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణికి ప్రజల నుంచి మొత్తం 84 దరఖాస్తులు అందాయి. వీటిలో జిల్లా కలెక్టరేట్ ప్రజావాణికి 39, ఆర్డీవో కార్యాలయాలకు 6, వివిధ మండలాల ఎంపీడీవో కార్యాలయాలకు 39 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి స్వయంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను ఏమాత్రం పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (DRO) శ్రీనివాస్, డీఆర్డీవో మేన శ్రీను తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వాహనదారులకు గుడ్ న్యూస్: ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లకుండానే ఇంట్లోనే ఓనర్‌షిప్ ట్రాన్స్‌ఫర్!

హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):

వాహన కొనుగోలుదారులు, విక్రయదారులకు తెలంగాణ రవాణా శాఖ భారీ ఊరట కల్పించింది. ఇకపై ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా వాహన యాజమాన్య బదిలీ (ఓనర్‌షిప్ ట్రాన్స్‌ఫర్) ప్రక్రియను సులభతరం చేస్తూ ఇంట్లోనే సేవలు పొందే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'వాహన్ సిటిజన్ సర్వీసెస్' అధికారిక పోర్టల్ ద్వారా ఓనర్‌షిప్ మార్పిడి చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. విక్రయదారుడు, కొనుగోలుదారుడు ఇద్దరూ పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించిన అనంతరం నేరుగా ఆర్సీ (RC) జారీ అవుతుంది. అంతేకాకుండా ఇతర రాష్ట్రాలకు



వాహనాల బదిలీ కోసం అవసరమైన ఎన్‌వోసీ (NOC), ఈ-కేవైసీ అప్‌డేట్ కూడా పోర్టల్‌లోనే పూర్తి చేసుకోవచ్చని, నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దని అధికారులు సూచించారు.

హనుమకొండలో అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం: కేయూ గేట్ సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో చెలరేగిన మంటలు!

హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):

కాకతీయ యూనివర్సిటీ (కేయూ) మొదటి గేటు సమీపంలో ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద అర్ధరాత్రి వేళ భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా భారీ ఎత్తున మంటలు ఎగసిపడటంతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని శ్రమించి మంటలను అదుపులోకి



తీసుకొచ్చారు. ఈ ప్రమాదానికి గల కారణాలు, జరిగిన ఆస్తి నష్టం వివరాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం.. మోహన్ కుటుంబానికి తీరని నష్టం

- **దుబ్బగూడలో విషాద ఘటన.. కష్టార్జితం అగ్నికి ఆహుతి.. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి**

సిర్పూర్, నవంబర్9,(ప్రజానేస్తం జ్వాల):

సిర్పూర్ మండలంలోని దుబ్బగూడ గ్రామంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని ఎల్లులే మోహన్‌కు చెందిన ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని ఆస్తి, సామగ్రికి తీవ్ర నష్టం వాటిల్లడంతో బాధిత కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది.ఎంతో కష్టపడి సంపాదించుకున్న ఆస్తి కళ్లముందే అగ్నికి ఆహుతి కావడంతో మోహన్ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. ఊహించని ఈ ఘటనతో కుటుంబానికి తీరని నష్టం వాటిల్లింది. ఆర్థికంగా నష్టపోయిన మోహన్ కుటుంబాన్ని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దాతలు



ఆదుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించి, తిరిగి నిలదొక్కుకునేందుకు అవసరమైన సహకారం అందించాలని కోరుతున్నారు.

దీపావళి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

- **క్రీడలు యువతలో ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందిస్తాయి: మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్**

కెరమెరి, నవంబర్9,(ప్రజానేస్తం జ్వాల):

దీపావళి పండుగను పురస్కరించుకొని కెరమెరి మండల పరిధిలోని ముఖదం గూడ గ్రామ యువకులు ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, మాజీ పంచాయతీ సమితి అధ్యక్షుడు సుగ్రీవు గోతవడే ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ జాదవ్ విమలాబాయి కేశవ్‌తో కలిసి టోర్నమెంట్‌ను ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు యువతలో ఐక్యత, స్నేహభావం, క్రమశిక్షణను పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక దృఢత్వానికి దోహదపడతాయని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని, స్నేహపూర్వక వాతావరణంలో ఆటలు ఆడాలని పిలుపునిచ్చారు.గ్రామీణ ప్రాంతాల్లో యువత ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని, క్రీడల ద్వారా ప్రతిభను వెలికితీసేందుకు మరిన్ని అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాదవ్ విమలాబాయి కేశవ్, ఉపసర్పంచ్ పతంగే లింబాదాస్, బాబూ నాయక్, సాహెబ్ రావు ఇంగ్లే, ప్రమోద్, తోరట్ శేషారావు, రాథోడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ విడుదల: డిసెంబర్ 2 వరకు దరఖాస్తుల స్వీకరణ!

హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి :



దేశ రక్షణ రంగంలో ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలనుకునే విద్యార్థుల కోసం ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (AISSEE-2027) నోటిఫికేషన్ విడుదలైంది. దేశవ్యాప్తంగా ఉన్న సైనిక్ పాఠశాలల్లో 6, 9వ తరగతుల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు డిసెంబర్ 2, 2026 వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రాతపరీక్ష జనవరి 31, 2027న జరగనుండగా.. 6వ తరగతి ప్రవేశాలకు తెలుగు సహా 13 భాషల్లో, 9వ తరగతికి కేవలం ఇంగ్లీష్ మాధ్యమంలోనే పరీక్ష నిర్వహించనున్నారు.

తెలంగాణలో జనగణనకు ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల!

హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):

కేంద్ర ప్రభుత్వ గెజిట్‌కు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో జనగణన ప్రక్రియ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన సర్వే చేపట్టనున్నారు. అనంతరం మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు రివిజనల్ రౌండ్ కొనసాగనుంది. అలాగే ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునేందుకు వీలుగా జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 'ప్రశస్త్' తప్పనిసరి: విద్యాశాఖ ఆదేశాలు!

హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):



తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో 'ప్రశస్త్' (PRASHAST) కార్యక్రమాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. 3 నుంచి 18 సంవత్సరాల వయసు గల దివ్యాంగ పిల్లలను ముందస్తుగానే గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ ప్రక్రియను చేపట్టాలని నిర్దేశించింది. ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రశస్త్ పోర్టల్‌లో నమోదు కావాలని, అర్హులైన విద్యార్థులందరికీ నిర్ణీత గడువులోగా స్క్రీనింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

కేయూమహిళా చెస్ జట్టు ఎంపిక: సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీకి పయనం!

హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):



సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు కాకతీయ యూనివర్సిటీ మహిళా చెస్ జట్టు ఎంపికైంది. హైదరాబాద్‌లోని వోక్సెన్ యూనివర్సిటీ వేదికగా నవంబర్ 9 నుంచి 12వ తేదీ వరకు ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో ఆరుగురు క్రీడాకారిణులు కేయూ తరఫున ప్రాతినిధ్యం వహించనుండగా, కోచ్ కమ్ మేనేజర్‌గా బి. రమ్య వ్యవహరిస్తారని కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ టి. శాస్త్రి వెల్లడించారు.

7 నెలల గరిష్టానికి చేరిన రూపాయి విలువ: మార్కెట్లలో జోరు!

హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):



అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ 28 పైసలు పుంజుకుంది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో గత సెషన్‌లో 93.98 వద్ద ముగిసిన రూపాయి విలువ, తాజాగా 93.70 స్థాయికి చేరుకుంది. గడచిన 7 నెలల కాలంలో రూపాయికిదే అత్యధిక స్థాయి కావడం విశేషం. విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్లలో ఏకంగా 4 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టడం, అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గడం రూపాయి బలోపేతానికి కలిసొచ్చాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

జాతీయ న్యాయ సేవల దినోత్సవం: సహృదయ వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు!

హనుమకొండ, 09 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):



జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని సహృదయ అనాథ వృద్ధాశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (DLSA) ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కవిత మాట్లాడుతూ.. మహిళలు, పిల్లలు, వృద్ధులు, ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాలకు సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఎలాంటి న్యాయ సమస్యలున్నా పరిష్కారం కోసం డీఎల్ఎస్ఏను నేరుగా సంప్రదించాలని ఆమె సూచించారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

బూరుగూడలో బెల్ట్ షాపులు మూసివేయాలని వినతి

- పాఠశాలల సమీపంలో మద్యం విక్రయాలతో విద్యార్థులకు ఇబ్బందులు -- అధికారుల తనిఖీలు చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్




ఆసిఫాబాద్, నవంబర్9, (ప్రజానేస్తం జ్వాల):

ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామంలో బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలోని వీధివీధికీ బెల్ట్ షాపులు ఏర్పాటు కావడంతో యువత మద్యానికి అలవాటు పడుతూ చెడు వ్యసనాలకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పాఠశాలల పరిసరాల్లోనే మద్యం విక్రయాలు జరుగుతుండటంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.సంబంధిత అధికారులు వెంటనే గ్రామంలో తనిఖీలు నిర్వహించి, అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

మైనారిటీ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఉచిత స్టడీ మెటీరియల్

- పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ, గ్రూప్-1, 2, 3, 4 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవకాశం

నల్లగొండ, నవంబర్9,(ప్రజానేస్తం జ్వాల):



తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ ఉ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో మైనారిటీ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షల కోసం ఉచిత స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి టి. విజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.TGPRB పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ), TGPSC గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.అర్హత కలిగిన అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో ఈ నెల 12-11-2026వ తేదీలోపు తమ దరఖాస్తులను నల్లగొండలోని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మైనారిటీ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఉన్నత ఉద్యోగాలను పొందాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబాలకు ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పరామర్శ

- కొత్తగూడెం గ్రామంలో నవీన్, లీలా ప్రసాద్ కుటుంబ సభ్యులకు ఓదార్పు.. ప్రగాఢ సానుభూతి



అనంతగిరి, నవంబర్ 9, (ప్రజానేస్తం జ్వాల):



అనంతగిరి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదాల్లో అకాల మరణం చెందడం పట్ల కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం గ్రామాన్ని సందర్శించిన ఆమె మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.గ్రామ మాజీ సర్పంచ్ భూక్యా రవి కుమారుడు నవీన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. అలాగే గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షుడు భూక్యా బాబు కుమారుడు లీలా ప్రసాద్ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం పట్ల సంతాపం తెలిపారు.చేతికందిన కుమారులను కోల్పోయిన తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతమని, ఈ విషాదం కుటుంబాలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని కోరుతూ, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ తీరని దుఃఖాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఎమ్మెల్యే ప్రార్థించారు.

వచ్చే వారంలోగా 75 శాతం ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

పెండింగ్‌లో ఉన్న 301 ఫిర్యాదుల్లో 200 పరిష్కారానికి కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశాలు

30 రోజులు దాటిన 149 ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన

నల్లగొండ, నవంబర్9,(ప్రజానేస్తం జ్వాల):

ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల్లో వచ్చే వారం నాటికి కనీసం 75 శాతం ఫిర్యాదులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజావాణికి సంబంధించి ప్రస్తుతం 301 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో వచ్చే వారంలోగా 200 ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. ఆ తర్వాతి వారానికి మిగిలిన మరో 100 ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న 149 ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని, జిల్లా అధికారులు సంబంధిత సెక్షన్ల సూపరింటెండెంట్లతో సమీక్షించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

హోస్టళ్లు, పాఠశాలలపై ప్రత్యేక దృష్టి

గతంలో నిర్దేశించిన విధంగా మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెలలో ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్వహణ, భోజన నాణ్యత, హాస్టళ్ల పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. పాఠశాల విద్యార్థులందరికీ ఈ నెలాఖరులోగా ఆధార్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని, మధ్యలో బడి మానేసిన పిల్లలందరినీ తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పైపులైన్లు, ఇతర చిన్నచిన్న మరమ్మతులు ముందుగానే చేపట్టాలని అధికారులకు సూచించారు. తాగునీటి ప్రాధాన్యత, వర్షపు నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వి.బి.-జి. రామ్‌జీ పథకం కింద మంజూరైన పనులన్నింటినీ క్షేత్రస్థాయిలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



అనర్హులకు పెన్షన్లు ఇవ్వొద్దు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన చేయూత పెన్షన్లను నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే పంపిణీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనర్హులకు పెన్షన్లు మంజూరు చేయరాదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ నెల 12న జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాతీతు హుస్సేన్ జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో, అన్ని శాఖల అధికారులు తమ శాఖల ద్వారా గిరిజనులకు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన నివేదికలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు.ప్రతి నెల 5వ తేదీలోగా జిల్లా అధికారులు ఆ నెలలో చేపట్టనున్న పర్యటనల దైరీని సమర్పించాలని సూచించారు. వార్తాపత్రికల్లో ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి వివరణ ఇవ్వడంతోపాటు, తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టరేట్ ఏఓ మోతిలాల్‌ను ఆదేశించారు.

85 మంది నుంచి ఫిర్యాదుల స్వీకరణ

ఈ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 85 మంది ఫిర్యాదుదారులు తమ దరఖాస్తులను సమర్పించారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 39 ఫిర్యాదులు, ఇతర శాఖలకు సంబంధించి 46 ఫిర్యాదులు అందాయి.ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, డీఆర్ఓ దశరథ్, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

బడ్జెట్ లెక్కలు చూపకుండా కౌన్సిల్ సమావేశమా?

- హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో ప్రత్యేక సమావేశంపై కౌన్సిలర్ల తిరుగుబాటు స్వరం
- జమా--ఖర్చుల వివరాలు లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు?
- పూర్తి బడ్జెట్ ప్రతులు ఇచ్చి, పరిశీలనకు సమయం కేటాయించాలని కమిషనర్‌కు వినతి

హుజూర్‌నగర్, నవంబర్ 9, (ప్రజానేస్తం జ్వాల):

బడ్జెట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అందించకుండా ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించడంపై హుజూర్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జనరల్ ఫండ్, క్యాపిటల్ ఫండ్‌లకు సంబంధించిన జమా--ఖర్చుల లెక్కలు వెల్లడించిన తర్వాతే సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ నెల 10న నిర్వహించేందుకు నిర్ణయించిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో జనరల్ ఫండ్, క్యాపిటల్ ఫండ్ బడ్జెట్ అంశాలపై చర్చించనున్నప్పటికీ, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పటివరకు కౌన్సిలర్లకు అందజేయలేదని వారు పేర్కొన్నారు. బడ్జెట్‌లో ఎంత ఆదాయం సమకూరింది? ఎంత ఖర్చు చేశారు? ఏయే పనులకు నిధులు కేటాయించారు? అనే వివరాలు తెలియకుండానే సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకోవడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు.ప్రజాధనానికి సంబంధించిన బడ్జెట్‌పై చర్చించే ముందు ప్రతి కౌన్సిలర్‌కు పూర్తి సమాచారం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. బడ్జెట్ వివరాలను



ముందుగానే లిఖితపూర్వకంగా అందజేసి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించేందుకు కనీసం ఒకటి లేదా రెండు రోజుల గడువు ఇవ్వాలని కోరారు. ఆ తర్వాతే ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వివరాలు లేకుండా సమావేశానికి అంగీకరించేది లేదు!

బడ్జెట్ లెక్కలు తెలియకుండా హడావుడిగా సమావేశం నిర్వహించడాన్ని తాము అంగీకరించబోమని కౌన్సిలర్లు స్పష్టం చేశారు. ప్రజలకు సంబంధించిన ఆర్థిక అంశాలపై పారదర్శకత ఉండాలని, కౌన్సిల్‌లో చర్చించే ప్రతి అంశంపై సభ్యులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.కౌన్సిలర్ల అభ్యంతరాల నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ప్రత్యేక సమావేశం విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

కోర్టు ఆదేశాలు బేఖాతరు.. రంగారెడ్డి కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష!

- కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు సంచలన తీర్పు.. రూ.2 వేల జరిమానా
- అప్పీల్‌కు అవకాశం కల్పిస్తూ నాలుగు వారాల పాటు శిక్ష అమలుపై సస్పెన్షన్

హైదరాబాద్, నవంబర్9(ప్రజానేస్తం జ్వాల):

న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా అమలు చేయలేదని నిర్ధారించిన తెలంగాణ హైకోర్టు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. అంతేకాకుండా రూ.2 వేల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. అయితే తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును నాలుగు వారాల పాటు నిలిపివేసింది.

అసలు వివాదం ఇదీ..

రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22-ఆ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ వినతిని పరిశీలించి 60 రోజుల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు 2025 ఆగస్టులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.అయితే నిర్దేశించిన గడువులోగా కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో బాధితులు 2025 అక్టోబర్ 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారుల వివరణపై కోర్టు అభ్యంతరం

కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో ఆలస్యం చేయడమే కాకుండా, కలెక్టర్ సమర్పించిన వివరణలోని అంశాలు రికార్డులతో సరిపోలడం లేదని న్యాయస్థానం గుర్తించింది. విచారణకు సంబంధించిన పత్రాల్లో సంబంధిత అధికారుల సంతకాలు లేకపోవడాన్ని కూడా ప్రస్తావించింది. అధికారుల వివరణ సంతృప్తికరంగా లేదని పేర్కొంది.కోర్టు ఇచ్చిన ఆదేశాల చట్టబద్ధతను కోర్టు ధిక్కరణ విచారణలో తిరిగి ప్రశ్నించలేరని, ఆదేశాలు సరైనవా కాదా అనే అంశంతో సంబంధం లేకుండా వాటిని తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఆరు నెలల జైలు.. నాలుగు వారాల గడువు

ఈ నేపథ్యంలో కలెక్టర్ చర్యలు ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను ధిక్కరించినట్లుగా నిర్ధారించిన జస్టిస్ కె. లక్ష్మణ్ ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అయితే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును నాలుగు వారాల పాటు నిలిపివేశారు.న్యాయస్థానాల ఆదేశాలను ప్రభుత్వ ఉన్నతాధికారులు సైతం తప్పనిసరిగా పాటించాల్సిందేనని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com
నవంబర్ | మంగళవారం | 10 | 2026

రెండు నెలలుగా జీతాల్లేవు.. పండగ పూటా పస్తులే!

- **హుజూర్‌నగర్ మున్సిపల్ కార్మికుల ఆవేదన.. వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్**
- **పీఎఫ్ బకాయిలు జమ చేయాలి.. ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న బట్టలు, చెప్పులు, ఇతర సామగ్రి అందించాలి**

హుజూర్‌నగర్, నవంబర్ 9,(ప్రజానేస్తం జ్వాల):

రెండు నెలలుగా వేతనాలు అందక మున్సిపల్ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పండుగ పూట కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల వేతన సమస్యలను మున్సిపల్ కమిషనర్ తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.హుజూర్‌నగర్‌లో ఆదివారం మున్సిపల్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో రోషపతి మాట్లాడుతూ.. రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో కార్మికులు అప్పులు చేసి పండుగ జరుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఏడాది కాలంగా బట్టలు, చెప్పులు, కొబ్బరినూనె తదితర నిత్యావసర వస్తువులు అందించడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా రెండేళ్లుగా కార్మికుల పీఎఫ్ బకాయిలను వారి ఖాతాల్లో జమ చేయకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.కార్మికుల సమస్యలపై మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు, పీఎఫ్ బకాయిలు జమ చేయాలని, ఏడాదిగా అందించని వస్తువులను వెంటనే పంపిణీ చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే కార్మికులు ఆందోళనకు సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు.సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వేతనాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని రోషపతి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్మికులు వెంకన్న, స్వరూప, నాగమణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.




తెలంగాణలో జనగణన--2027కు తేదీలు ఖరారు!

- **జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఇంటింటి సర్వే.. జనవరి 10 నుంచి స్వీయ జనగణనకు అవకాశం**
- **మార్చి 1 నుంచి 5 వరకు రివిజనల్ రౌండ్.. అర్ధరాత్రి 12 గంటలను ప్రామాణిక తేదీగా నిర్ణయం**

హైదరాబాద్,నవంబర్9,(ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ రాష్ట్రంలో జనగణన--2027 నిర్వహణకు ప్రభుత్వం తేదీలను ఖరారు చేసింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 155ను విడుదల చేసింది.జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు ప్రజలకు స్వీయ జనగణన చేసుకునే అవకాశం కల్పించింది. అనంతరం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు అధికారులు ఇంటింటికీ వెళ్లి జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్నారు.జనగణన ప్రక్రియలో భాగంగా సేకరించిన వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు చేపట్టేందుకు మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు రివిజనల్ రౌండ్ నిర్వహించనున్నారు. 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను జనగణనకు ప్రామాణిక తేదీగా ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర నోటిఫికేషన్‌కు అనుగుణంగా రాష్ట్రంలో జనగణన నిర్వహణకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది.


GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Census 2027- Phase – II - Population Enumeration (PE) – Notification of dates for conducting Population Enumeration, Self-Enumeration and Revisional Round – Re-publication of the Gazette of India Notification No. S.O. 5913(E), dated 30th October, 2026 in the State Gazette of Telangana – Orders - Issued.

ఆ వెలుగులెక్కడ?

ప్రతి దీపావళికీ
ఏవో కొత్త వెలుగులు వస్తాయని..
జీవితంలో నూతన అధ్యాయం మొదలవుతుందని..
పాత జ్ఞాపకాల చీకట్లు తొలగిపోతాయని..
చిన్ననాటి నుంచి ఎన్నో కలలు కన్నాను.
కానీ..
ఇప్పటివరకు నా కలల ఆకాశంలో
ఆ వెలుగుల జాడలే కనిపించడం లేదు.
అయితే..
ఇంటి కిటికీలకు, తలుపులకు పట్టిన బూజును
ప్రతి పండక్కీ తప్పకుండా తొలగిస్తున్నాం.
పిల్లలు గీతలు గీసి, రాతలతో నింపిన
దుమ్ముపట్టిన గోడలకు సున్నం వేస్తే..
ఇల్లంతా కొత్తదనపు ఛాయలు అద్దుకుంటోంది.
కాసేపు పండుగ సంబరం కళ్లముందు కదలాడుతోంది.
కానీ..
పాతబడిపోయిన బడి సంచులు..
అక్కడక్కడా పగుళ్లు పడి, మూలన పడేసిన
వంటింటి సామగ్రి..
చిరిగిపోయి, చిందరవందరగా పేరుకుపోయిన
పాత పుస్తకాల కుప్పలు..
మూలన మౌనంగా పడి, దుమ్ము కప్పుకున్న
నాటి జ్ఞాపకాల డైరీలు..
వాటిని చూసినప్పుడల్లా
ఎందుకో మనసులో ఏదో తెలియని అలజడి.
కాలం చెరిపేసిందనుకున్న జ్ఞాపకాలన్నీ
మళ్లీ ఒక్కసారిగా కళ్లముందు నిలుస్తాయి.
వాటికి పట్టిన బూజును దులిపేయాలని చూసినా
మనసు మాత్రం వాటిని విడిచిపెట్టడానికి
ససేమిరా అంటోంది.
అందుకేనేమో..
పండుగలు వస్తుంటాయి.. పోతుంటాయి..
క్యాలెండర్‌లో అంకెలు మారుతుంటాయి.
డైరీలో పేజీలు తిరుగుతుంటాయి.
జీవితంలో అప్పులు పెరుగుతుంటాయి.
వయసు మాత్రం ఎవరి అనుమతి లేకుండానే



తన ప్రయాణాన్ని కొనసాగిస్తుంటుంది.
నిజమే..
మనకు పండుగలతో పనిలేదు..
పాత జ్ఞాపకాలతోనూ పనిలేదు..
గడిచిపోయిన కాలాన్ని వెనక్కి తెచ్చుకోలేం.
నిన్నటి గాయాలను చెరిపేయలేం.
కానీ..
నేటి ఆలోచనలకు కొత్త వెలుగులు అద్దుకోవచ్చు.
రేపటి ప్రయాణానికి కొత్త బాటలు వేసుకోవచ్చు.
నిన్నటి చీకట్లను తలుచుకుంటూ కూర్చోకుండా
నేటి వెలుగులో రేపటి ఆశలను వెతుక్కోవచ్చు.
ఎందుకంటే..
ఇంటి గోడలకు సున్నం వేయడం కాదు దీపావళి..
మనసులోని నిరాశలకు కొత్త రంగులద్దుకోవడం.
ఇంటి గడపలో దీపాలు వెలిగించడం కాదు దీపావళి..
మన ఆలోచనల్లో ఆశల జ్యోతులు వెలిగించడం.
ప్రతి రోజూ కొత్త ఆలోచనతో..
ప్రతి అడుగూ కొత్త ఆశతో..
నిన్నటి జ్ఞాపకాల సంకెళ్లను తెంచుకుని
రేపటి జీవితంలోకి ధైర్యంగా అడుగుపెట్టడమే
నిజమైన దీపావళి..
అదే అసలైన వెలుగు!
– వేకువ
తాళ్ళపెల్లి సురేందర్..

మోడిఫైడ్ సైలెన్సర్‌తో హల్‌చల్.. బైక్ సీజ్ చేసిన ట్రాఫిక్ పోలీసులు!

- **అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వాహనంపై చర్యలు**
- **యువకుడు అందించిన వీడియోతో రంగంలోకి దిగిన పోలీసులు.. నిబంధనలకు అనుగుణంగా సైలెన్సర్ మార్పు**

సూర్యాపేట,నవంబర్9, (ప్రజానేస్తం జ్వాల):



ద్విచక్ర వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చి, భారీ శబ్దాలతో రహదారులపై హల్‌చల్ చేస్తున్న వాహనదారులపై సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని, వాహనదారుడిపై కేసు నమోదు చేశారు.పట్టణ రహదారులపై ఓ ద్విచక్ర వాహనం మోడిఫైడ్ సైలెన్సర్‌తో అధిక శబ్దాలు చేస్తూ ప్రయాణిస్తున్న విషయాన్ని గమనించిన ఓ బాధ్యతగల యువకుడు ఆ దృశ్యాలను వీడియో చిత్రీకరించి ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డికి అందించారు. ఈ వీడియోపై వెంటనే స్పందించిన ట్రాఫిక్ పోలీసులు సదరు వాహనాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.వాహనానికి నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్‌ను తొలగించి, మెకానిక్ వద్ద నిబంధనలకు అనుగుణమైన సైలెన్సర్‌ను ఏర్పాటు చేయించారు. వాహనదారుడిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లు అమర్చడం, అధిక శబ్దాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం, రహదారులపై అతివేగంగా వాహనాలు నడపడం వంటి చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు, ప్రజలకు ఇబ్బందులు కలిగించే వాహనాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజల భద్రత, ప్రశాంతమైన రహదారి ప్రయాణం కోసం ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.

కీసర పోలీస్ స్టేషన్‌లో మరోసారి ఏసీబీ వల.. రూ.2 లక్షల లంచంతో ఎస్ఐ అరెస్ట్!

- **చార్జిషీట్లు త్వరగా దాఖలు చేసేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు**
- **ఇటీవల సీఐ, మరో ఎస్ఐ పట్టుబడిన ఘటన మరువకముందే మరో అధికారి చిక్కడంతో కలకలం**

హైదరాబాద్, నవంబర్9,(ప్రజానేస్తం జ్వాల):



కీసర పోలీస్ స్టేషన్‌లో మరో అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఎస్ఐ కొండారెడ్డి శ్రీనివాస్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. సోమవారం ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్ని ఆయనను పట్టుకున్నారు.ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. కీసర పోలీస్ స్టేషన్‌లో నమోదైన రెండు కేసుల్లో విచారణను వేగవంతం చేసి, చార్జిషీట్లు త్వరగా దాఖలు చేయడానికి ఫిర్యాదుదారుడి నుంచి ఎస్ఐ శ్రీనివాస్ రూ.2 లక్షలు లంచంగా డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. లంచం ఇచ్చేందుకు ఇష్టపడని బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో అధికారులు రంగంలోకి దిగారు.ఏసీబీ పథకం ప్రకారం సోమవారం కీసర పరిధిలోని శిల్పా లేఅవుట్ ప్రాంతంలో ఫిర్యాదుదారుడి నుంచి రూ.2 లక్షలు స్వీకరిస్తుండగా ఎస్ఐను అధికారులు పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి అరెస్టు చేసి, నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టారు.

ఒకే స్టేషన్‌లో వరుస అవినీతి ఘటనలు!

ఇటీవల ఇదే కీసర పోలీస్ స్టేషన్‌కు చెందిన సీఐ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి లంచం కేసులో ఏసీబీకి పట్టుబడినట్లు వార్తలు వెలువడ్డాయి. ఆ ఘటన మరువకముందే తాజాగా మరో ఎస్ఐ రూ.2 లక్షల లంచం కేసులో చిక్కడం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.ఒకే పోలీస్ స్టేషన్‌కు చెందిన పలువురు అధికారులు వేర్వేరు లంచం కేసుల్లో ఏసీబీకి పట్టుబడటం పోలీస్ శాఖలో అవినీతి నిరోధక చర్యలు, అంతర్గత పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. తాజా కేసులో ఏసీబీ దర్యాప్తు కొనసాగుతోంది.

నల్గొండ జిల్లాలో కలకలం.. గురుకులంలో బాలికలపై వేధింపుల ఆరోపణలు!

- **బాత్రూమ్‌లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ చిన్నారుల ఆవేదన.. పారిశుద్ధ్య కార్మికుడిపై తీవ్ర ఆరోపణలు**

నిడమనూరు, నవంబర్9,(ప్రజానేస్తం జ్వాల):

నల్గొండ జిల్లాలోని నిడమనూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ ఓ పారిశుద్ధ్య కార్మికుడిపై తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి.సదరు కార్మికుడు తమను అసభ్యకరంగా తాకుతున్నాడని, బాత్రూమ్‌లోకి తీసుకెళ్లి తలుపులు మూస్తున్నాడని పలువురు మైనర్ బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తమకు ఎదురవుతున్న ఇబ్బందులను చిన్నారులు వెల్లడించడంతో ఈ విషయం ఆందోళనకు దారితీసింది. విద్యార్థినులకు రక్షణ కల్పించాల్సిన గురుకుల పాఠశాలలో ఇలాంటి ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. ఈ ఘటనపై విద్యాశాఖ, సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, బాలికలకు భద్రత కల్పించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.